# ప్రతి ప్రాణం విలువైందే!

- రోడ్డు భద్రత నియమాలు పాటించాలి!
- వేములవాడ డీఎస్పీ శ్రీనివాసులు




**ప్రజానావ, వేములవాడ:** రాజన్న సిరిసిల్ల జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా పోలీస్ యంత్రాంగం రంగంలోకి దిగింది. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు వేములవాడ పట్టణ పరిధిలో 'అరైవ్ అలైవ్' కార్యక్రమాన్ని వేములవాడ డీఎస్పీ శ్రీనివాసులు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పట్టణంలోని ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను (బ్లాక్ స్పాట్స్) గుర్తించి, అక్కడ భద్రతా చర్యలను బలోపేతం చేశారు. ప్రతి ఒక్కరూ విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, అప్పుడే క్షేమంగా గమ్యస్థానాలకు చేరుకోగలరని డీఎస్పీ ఈ సందర్భంగా వాహనదారులకు విజ్ఞప్తి చేశారు. ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు రబ్బర్ స్ట్రిప్స్ ఏర్పాటు చేయడంతో పాటు, పాదచారుల భద్రత కోసం జీబ్రా క్రాసింగ్ పెయింటింగ్‌లను పోలీసులు వేయించారు. వాహనదారులకు దిశానిర్దేశం చేసేలా ప్రధాన కూడళ్లలో సూచిక బోర్డులను ఏర్పాటు చేశారు. ముఖ్యంగా రాత్రి సమయాల్లో ప్రమాదాలు జరగకుండా మలుపుల వద్ద రేడియం స్టిక్కర్లను అంటించారు. రోడ్డుకు ఇరువైపులా వాహనాల రాకపోకలకు ఆటంకంగా మారిన చెట్ల కొమ్మలను తొలగించి, మార్గాన్ని సుగమం చేశారు. ఈ చర్యల ద్వారా వాహనదారుల్లో అప్రమత్తత పెరుగుతుందని, తద్వారా రోడ్డు ప్రమాదాలు తగ్గుముఖం పడతాయని పోలీసులు ఆశాభావం వ్యక్తం చేశారు. కేవలం పోలీసుల చర్యల వల్లే కాకుండా, ప్రజల సహకారం ఉంటేనే ప్రమాద రహిత సమాజాన్ని నిర్మించగలమని అధికారులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఇన్స్పెక్టర్ వీరప్రసాద్, ట్రాఫిక్ ఆర్.ఐ సురేష్, ఎస్.ఐలు రామ్మోహన్, రాజు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# మామిడి పండ్ల ఆశ చూపి.. పసిపాపపై పైశాచికం!

## పుణేలో రెండున్నరేళ్ల బాలికపై లైంగిక దాడి

## 47 ఏళ్ల నిందితుడి అరెస్ట్



**ప్రజానావ, ముంబై:** మహారాష్ట్ర సాంస్కృతిక రాజధాని పుణేలో సభ్యసమాజం తలదించుకునేలా ఒక అత్యంత హేయమైన ఘటన వెలుగులోకి వచ్చింది. పసి మొగ్గ అని కూడా చూడకుండా రెండున్నరేళ్ల చిన్నారిపై ఒక మధ్యవయస్కుడు లైంగిక దాడికి పాల్పడ్డాడు. పింప్రి-చించ్వాడ్ ప్రాంతంలో జరిగిన ఈ ఘోరం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. మామిడి పండ్లు ఇస్తానని ఆశ చూపి ఆ పసిపాపను లోబర్చుకున్న నిందితుడి పైశాచికత్వానికి ఆ చిన్నారి ఆసుపత్రి పాలైంది. పోలీసుల వివరాల ప్రకారం.. నిందితుడు విజయ్ భోసలే (47) అదే ప్రాంతంలో నివాసం ఉంటున్నాడు. తన ఇంటి సమీపంలో ఆడుకుంటున్న రెండున్నరేళ్ల బాలికకు మామిడి పండ్లు ఇస్తానని ఆశ చూపి తన గదిలోకి తీసుకెళ్లాడు. అక్కడ ఆ చిన్నారిపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఆ తర్వాత ఇంటికి వెళ్లిన బాలిక తీవ్ర అస్వస్థతకు గురవడంతో పాటు శారీరక ఇబ్బందులతో ఏడవడం మొదలుపెట్టింది. దీంతో కంగారుపడిన తల్లిదండ్రులు ఆమెను వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. వైద్యులు బాలికను పరీక్షించగా, ఆమెపై లైంగిక దాడి జరిగినట్లు నిర్ధారణ అయింది. ఈ విషయం విని నిర్ఘాంతపోయిన తల్లిదండ్రులు వెంటనే పోలీసులను ఆశ్రయించారు. బాధితుల ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన పింప్రి-చించ్వాడ్ పోలీసులు నిందితుడు విజయ్ భోసలేను అరెస్ట్ చేశారు. నిందితుడిపై భారత శిక్షాస్మృతిలోని సంబంధిత సెక్షన్లతో పాటు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ కిరాతక చర్యపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తున్నారు.

# అక్రమ ఇసుక రవాణా చేస్తే జైలుకే..

## వేములవాడ డీఎస్పీ శ్రీనివాసులు

**ప్రజానావ, వేములవాడ:** వేములవాడ పట్టణ పరిధిలోని మూలవాగు ఇసుక రీచ్‌లో అక్రమ తవ్వకాలు, నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న రవాణాపై పోలీస్ శాఖ ఉక్కుపాదం మోపింది. వేములవాడ డీఎస్పీ శ్రీనివాసులు బుధవారం పట్టణ ఇన్స్పెక్టర్ వీరప్రసాద్‌తో కలిసి ఇసుక రీచ్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఇసుక తవ్వకాల విధానం, రవాణాకు సంబంధించిన అనుమతులు మరియు రికార్డుల నిర్వహణను ఆయన సమగ్రంగా పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఎటువంటి కార్యకలాపాలు సాగినా ఉపేక్షించేది లేదని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం 'మన ఇసుక వాహనం' ఆన్‌లైన్ విధానం ద్వారానే ఇసుక సరఫరా జరగాలని సూచించారు. అనుమతి లేకుండా ఇసుకను తరలించినా, అనధికారికంగా నిల్వలు ఉంచినా కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పారదర్శకత లేని ఇసుక దందాలకు పాల్పడితే సంబంధిత వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు, రవాణాకు వాడుతున్న వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఇసుక రవాణాలో అక్రమాలను అరికట్టేందుకు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ పెంచాలని సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టేలా ఎవరైనా అక్రమ మార్గాల్లో ఇసుకను తరలిస్తే సమాచారం అందించాలని ప్రజలను కోరారు. ఇసుక రవాణాదారులు ప్రభుత్వం సూచించిన నిబంధనలను తప్పనిసరిగా అనుసరించాలని, పారదర్శకమైన విధానాల ద్వారానే వినియోగదారులకు ఇసుక చేరాలని ఆయన స్పష్టం చేశారు. ఈ తనిఖీల్లో పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


# విద్యార్థి దశ నుండే ట్రాఫిక్‌పై అవగాహన అవసరం

- నిబంధనలు పాటిస్తూ పిల్లలకు ఆదర్శంగా నిలవాలి
- పోలీస్ అధికారుల పిలుపు

**ప్రజానావ, సిరిసిల్ల :** విద్యార్థులు చిన్నతనం నుంచే ట్రాఫిక్ నియమాలపై అవగాహన కలిగి ఉంటేనే భవిష్యత్తులో బాధ్యతాయుత పౌరులుగా ఎదుగుతారని జిల్లా పోలీస్ యంత్రాంగం స్పష్టం చేసింది. 'అరైవ్ అలైవ్' కార్యక్రమంలో భాగంగా బుధవారం మూడో రోజు జిల్లావ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలోని పాఠశాలలు, కళాశాలల్లో రోడ్డు భద్రతపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థుల ద్వారా కుటుంబాల్లో మార్పు తీసుకురావాలనే లక్ష్యంతో పోలీసులు చేపట్టిన ఈ కార్యక్రమానికి విద్యా సంస్థల నుంచి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో భాగంగా 'డియర్ పేరెంట్స్.. ప్లీజ్ బై ఏ హెల్మెట్ ఫర్ మీ అండ్ మామ్' అనే నినాదంతో పోలీసులు వినూత్న ప్రయోగం చేశారు. ద్విచక్ర వాహనాలు నడిపే సమయంలో తల్లిదండ్రులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించేలా విద్యార్థులు తమ ఇంట్లో వారిని ఒప్పించాలని కోరారు. తమ క్షేమం కోసమైనా హెల్మెట్ కొనుగోలు చేయాలని పిల్లలు తల్లిదండ్రులకు లేఖలు రాయడం విశేషం. దీనితో పాటు రోడ్డు దాటేటప్పుడు జీబ్రా క్రాసింగ్ వాడకం, ట్రాఫిక్ సిగ్నల్స్ అర్థం చేసుకోవడం, స్కూల్ బస్సుల్లో ప్రయాణించేటప్పుడు తీసుకోవాల్సిన భద్రతా జాగ్రత్తల గురించి విద్యార్థులకు పోలీసులు వివరించారు. కేవలం అవగాహన సదస్సులే కాకుండా, క్షేత్రస్థాయిలో ప్రమాదాల నివారణకు పోలీసులు పకడ్బందీ చర్యలు చేపట్టారు. జిల్లావ్యాప్తంగా ప్రమాదాలు ఎక్కువగా జరిగే 'బ్లాక్ స్పాట్స్'ను గుర్తించి, అక్కడ వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు రబ్బర్ స్ట్రిప్స్ ఏర్పాటు చేశారు. వాహనదారులకు హెచ్చరికలు జారీ చేసేలా సూచిక బోర్డులు, మలుపుల వద్ద స్పష్టంగా కనిపించే రేడియం స్టిక్కర్లను అమర్చారు. రోడ్డుకు ఇరువైపులా వాహనాల రాకపోకలకు ఆటంకంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించి మార్గాన్ని సుగమం చేశారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ట్రాఫిక్ నియమాలను పాటిస్తూ పిల్లలకు ఆదర్శంగా నిలవాలని ఈ సందర్భంగా పోలీస్ అధికారులు విజ్ఞప్తి చేశారు.







# డేటింగ్ యాప్ మోసం

## బార్‌లో రూ.34 వేల బిల్లు

**ప్రజానావ, ముంబై:** నాగ్‌పూర్‌లో డేటింగ్ యాప్ ద్వారా యువకులను వలలో వేసి బార్‌కు తీసుకెళ్లి అధిక బిల్లులు వసూలు చేసే ముఠా వెలుగులోకి వచ్చింది. హర్షద్ అనే వ్యక్తిని 'తను' అనే యువతి బార్‌కు తీసుకెళ్లి ఖరీదైన ఆర్డర్లు ఇచ్చి రూ.34,213 బిల్లు వేయించారు. డబ్బులు చెల్లించకపోతే బెదిరించడంతో అతను ఆన్‌లైన్‌లో చెల్లించాడు. అనంతరం యువతి అక్కడి నుంచి పరారైంది. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా, బార్ యజమాని సహా ముఠాపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ముంబైలో డ్రగ్స్ రాకెట్ బట్టబయలు

## చిన్న గది నుంచి రూ.30 కోట్ల వ్యాపారం




**ప్రజానావ, ముంబై:** ముంబై ఖార్ పోలీసులు అంధేరిలోని సహార్ రోడ్డులో ఉన్న భాస్కర్ చాల్‌లో రూ.13,000 అద్దె గదిలో నడుస్తున్న సింథటిక్ డ్రగ్స్ (ఎండీ) రహస్య ఫ్యాక్టరీని బయటపెట్టారు. ఈ గదిలో ప్రతి నెల రూ.25--30 కోట్ల విలువైన డ్రగ్స్ తయారీ జరుగుతున్నట్టు వెల్లడైంది. గుజరాత్‌కు చెందిన పరారీలో ఉన్న నిందితుడు మహమ్మద్ ఆరిఫ్ షేక్ ఈ దందా నడుపుతూ ఉండగా అరెస్టయ్యాడు. అతనికి సహకరించిన రిజ్వాన్ అహ్మద్‌ను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గదిలో డ్రగ్స్, రసాయనాలు, పరికరాలు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడి భార్య ఖాతాలో ఉన్న రూ.26 లక్షలను ఫ్రీజ్ చేసి, ఆమెను విచారిస్తున్నారు. ఈ ఘటన ముంబైలో డ్రగ్స్ అక్రమ రవాణాపై కొత్త ఆందోళనలకు దారితీసింది.

# అనాథల జీవితాలతో ఆటలు

## 'కామాంధ' బంధువులకు 20 ఏళ్ల జైలు!



**ప్రజానావ, ముంబై :** ముంబై సమీపంలోని బేలాపూర్ కోర్టు కీలక తీర్పు ఇచ్చింది. తల్లిదండ్రులు లేని ఇద్దరు అనాథ బాలికలను బలవంతంగా డాన్స్ బార్లు, వ్యభిచారంలోకి నెట్టిన మేనత్త, మామలకు కోర్టు 20 ఏళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు చెరో రూ.33,000 జరిమానా విధించింది. పోలీసుల దర్యాప్తులో, నిందితులు బాలికలను మోసం చేసి వారి సంపాదనతో విలాసవంతమైన జీవితం గడిపినట్టు తేలింది. పెద్ద బాలిక ఫిర్యాదు చేయడంతో క్రైమ్ బ్రాంచ్ బాధితులను రక్షించి, నిందితులను అరెస్ట్ చేసింది. భారత శిక్షాస్మృతి సెక్షన్ 370, పోక్సో, పిటా చట్టాల కింద దోషులుగా నిర్ధారించిన కోర్టు, 2026 ఏప్రిల్ 10న ఈ తీర్పు వెలువరించింది.

# దూడపై చిరుత దాడి

## పోతిరెడ్డి పల్లెలో కలకలం

**ప్రజానావ, సిరిసిల్ల :** ఎల్లారెడ్డిపేట మండలం పోతిరెడ్డిపల్లె గ్రామంలో ఓ చిరుత దూడపై దాడి చేసి చంపి తిన్న ఘటన జరిగింది. దీంతో గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. పోతిరెడ్డి పల్లె గ్రామానికి చెందిన సదుల పూర్ణ అటవీ శివారు ప్రాంతంలో నివసిస్తుంది. తమ గుడిసెల వద్ద గేదె, దూడను కట్టి వేయగా బుధవారం తెల్లవారు జామున లేచి చూసేసరికి దూడను చిరుత చంపిన వైనం గమనించింది. ఈ సంఘటనతో ఆ కుటుంబం బోరున విలపించింది. ఇది ఇలా ఉండగా చిరుత కలకలంతో గ్రామంలో ఒక్కసారిగా వాతావరణం వేడెక్కింది. వెంటనే అటవీ శాఖ సిబ్బంది చిరుతను పట్టుకోవాలని అక్కడి ప్రజలు కోరుతున్నారు.



